క్లుప్తంగా

సామర్లకోట పీఎస్‌లో రేపు పోలీస్ 'స్పందన'

కాకినాడ క్రైం: పోలీసు స్పందనను సోమవారం సామర్లకోట్లలో నిర్వహించనున్నట్టు ఎస్పీ సతీష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహిస్తున్న పోలీస్ స్పందన అర్జీల స్వీకరణను ప్రజల సౌకర్యార్థం సోమవారం సామర్లకోట పీఎస్‌లో నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అర్జీదారులు, ఫిర్యాదుదారులు మార్పును గమనించి స్పందనకు హాజరు కావలనుకునే వారు నేరుగా సామర్లకోట పీఎస్‌కు రావాలని ఎస్పీ కోరారు.

నేడు జూనియర్స్ అథ్లెటిక్స్‌కు ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జూనియర్స్ విభాగంలో అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యం శనివారం తెలిపారు. స్థానిక పీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో ట్రాక్‌ను సిద్ధం చేశామన్నారు. అండర్ 14, 16, 18, 20, 23 విభాగాల్లో బాలురు, బాలికలను ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల వారు జనన ధ్రువీకరణ పత్రం, టెన్త్‌క్లాస్ మార్క్స్‌లిస్ట్‌లతో ఎంపికలకు హాజరుకావాలని కోరారు. ఎంపికలకు చైర్మన్‌గా వై.తాతబ్బాయి, నిర్వాహక కార్యదర్శిగా బీవీజీటీ రాజు వ్యవహరిస్తున్నట్టు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయిని విజయదుర్గకు సత్కారం



విజయదుర్గను సత్కరిస్తున్న గ్రామ పెద్దలు, నాయకులు

కాకినాడ సిటీ: మండలం తూరంగి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం కడలి విజయదుర్గ రాష్ట్ర స్థాయి ఉత్తమ పురస్కారం సాధించడంతో గ్రామ పెద్దలు, ప్రజలు శనివారం పాఠశాలలో సత్కరించారు. నాడు–నేడులో భాగంగా పాఠశాల అభివృద్ధి, ఇతర కార్యక్రమాల సమర్థ నిర్వహణపై ఆమె ఈ పురస్కారాన్ని సాధించారంటూ వారు సత్కరించారు. మాజీ సర్పంచ్ బలగం ప్రసన్నకుమార్, తురంగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ గొల్లపల్లి సూర్యప్రకాశరావు, గ్రామ పెద్దలు తదితరులు సత్కరించిన వారిలో ఉన్నారు.

ఆటో డ్రైవర్‌కు రూ.లక్ష ఆర్థిక సాయం



శేఖర్‌కు ఆర్థిక సహాయం అందిస్తున్న వడ్డి మణికుమార్ తదితరులు

కాకినాడ రూరల్: కాకినాడ అర్బన్ 3వ డివిజన్‌కు చెందిన ఆలమూరి శేఖర్ లివర్ సమస్యతో బాధపడుతున్నాడు. ఆటో డ్రైవర్‌గా పనిచేసే శేఖర్‌కు భార్య కళ, ఐదేళ్ల పాప, మూడేళ్ల బాబు ఉన్నారు. అనారోగ్యం విషయం తెలుసుకున్న మూడో డివిజన్ మాజీ కార్పొరేటరు, వైఎస్సార్ సీపీ నాయకుడు వడ్డి మణికుమార్ డివిజన్‌లోని చుట్టు పక్కల వారు ఇతరులు కలిపి రూ.లక్ష సేకరించి శనివారం శేఖర్, కుటుంబ సభ్యులకు అందించారు. అందులో రూ.50 వేలను కేటీసీ, ఎస్‌బీసీ వ్యవస్థాపకుడు ఎస్ఎస్ కిరణ్‌కుమార్ అందించారు.

అందరి సహకారంతో మండల అభివృద్ధి

ఎంపీపీ గోపుశెట్టి పద్మజ



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మజ. చిత్రంలో ఎంపీడీఓ స్వప్న, తహసీల్దార్ మురార్జీ

కాకినాడ రూరల్: మండలంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌ల సహకారంలో మండల పరిషత్ ద్వారా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎంపీపీ గోపుశెట్టి పద్మజ తెలిపారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన శనివారం జరిగింది. తొలుత ఎంపీడీఓ కర్రే స్వప్న మండలంలో అభివృద్ధి పనులు, సంక్షేమం తదితర వివరాలను తెలియజేశారు. అనంతరం అధికారులు శాఖల వారిగా నివేదికలు సమావేశంలో తెలియజేశారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుల సమస్యలకు పరిష్కారాలపై అధికారులు హామీ ఇచ్చారు. నేమాం సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు, సమావేశంలో తహసీల్దార్ మురార్జీ, మండల ఇంజినీర్ వాసుదేవరావు, ఏఓ సత్యనారాయణ, హౌసింగ్ ఏఈ రాంబాబు, ఇరిగేషన్ ఏఈ శివకృష్ణ, ఆర్ అండ్‌బీ ఏఈ లోవబాబు తదితరులు పాల్గొన్నారు.

సాగరతీరం పరిశుభ్రం

- ఘనంగా అంతర్జాతీయ పరిశుభ్రత దినోత్సవం
- ఇండియన్ కోస్ట్‌గార్డు, ఓఎన్‌జీసీ వేర్వేరుగా ప్లాస్టిక్ వ్యర్థాల ఏరివేత
- 1065 కిలోల చెత్త, చెదారం సేకరణ



తీరంలో సేకరించిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలతో ఇండియన్ కోస్ట్ గార్డ్ సిబ్బంది

కాకినాడ రూరల్: పర్యావరణ హితం కోరుతూ కాకినాడ తీరం సూర్యారావుపేట బీచ్ వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను శుభ్రం చేశారు. శనివారం అంతర్జాతీయ తీర పరిశుభ్రతా దినోత్సవం సందర్భంగా ఇండియన్ కోస్ట్ గార్డు, కస్టమ్స్ ఆధ్వర్యంలో వేర్వేరుగా కార్యక్రమాలు చేపట్టారు.

ప్లాస్టిక్ వినియోగం మానుకోవాలి : ఓఎన్‌జీసీ ఈడీ రత్నేష్‌కుమార్

ఇండియన్ కోస్ట్ గార్డు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఓఎన్‌జీసీ కాకినాడ అసెట్ మేనేజర్, ఈడీ రత్నేష్‌కుమార్ పాల్గొని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల అనర్థాలు ఎక్కువని, మనం వినియోగించే వ్యర్థాలు 80 శాతం సముద్రంలోకి చేరుతున్నాయన్నారు. పసిఫిక్ సముద్రంలో 200 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు 11 కిలోమీటర్ల మేర తేలియాడుతూ సమస్యగా మారాయన్నారు. కాలుష్య నియంత్రణలో ఓఎన్‌జీసీ సామాజిక బాధ్యతగా పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో ఇండియన్ కోస్టుగార్డ్ కాకినాడ స్టేషన్ కమాండెంట్ టీఆర్‌కే రావు, కమాండింగ్ ఆఫీసరు ప్రఫుల్లకుమార్, రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన ఎన్.శ్రీనివాస్, సీపోర్టు సీనియర్ మేనేజరు కరీమ్, వేదాంత లిమిటెడ్ బేస్ మేనేజరు కృష్ణ, మెరైన్ ఎస్సై సత్యనారాయణరెడ్డి, ఈకో లాస్టిక్ సంస్థ ప్రతినిధి రవిశంకర్, మెడికవర్ ఆస్పత్రికి చెందిన దినేష్ తదితరులు పాల్గొన్నారు. సుమారు 750 మంది పాల్గొని 1065 కేజీల వ్యర్థాలను సేకరించారు. ఇందులో 48.8 శాతం ప్లాస్టిక్ వ్యర్థాలు ఉన్నాయి.

ఆక్సిజన్ కొనుక్కోవాల్సి వస్తుంది : రాష్ట్ర కస్టమ్స్ కమిషనర్ సాధు

పర్యావరణాన్ని కాపాడుకోకపోతే ఆక్సిజన్‌ను కొనుక్కోవల్సి వస్తుందని రాష్ట్ర కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఓషన్ సొసైటీ ఆఫ్ ఇండియా సహకారంతో కస్టమ్స్ డిపార్టుమెంట్, రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కాకినాడ పీఆర్ కళాశాల, ప్రభుత్వ మహిళా కళాశాల, రేడియో అల 90.8 ఎఫ్ ఎం, డ్వాక్రా మహిళలు, సంయుక్త ఆధ్వర్యంలో సూర్యారావుపేట బీచ్‌లో వ్యర్థాలను తొలగించారు. కమిషనర్ నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని భూమి, సముద్ర కాలుష్యాల వల్ల భావితరాలు ఇబ్బంది పడతాయన్నారు. కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న ఓఎన్‌జీసీ ఈడీ రత్నేష్‌కుమార్ దంపతులు

బొజ్జనింపు గణపయ్య

- ఎన్నో వర్గాలకు ఉపాధినిచ్చే పండగ
- మండపాల ఏర్పాట్లు, నిర్వహణలో కార్మికులకు చేతి నిండా పని
- హర్షం వ్యక్తం చేస్తున్న కష్టజీవులు



విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

కాకినాడ సిటీ: పండగ అంటే ఏ ఒక్క వార్గానికో లబ్ధి చేకూరేది కాదు. హైందవ ధర్మంలో అందరికీ శ్రేయస్సు చేకూర్చేలా పండగలకు ఒక విశిష్టత ఉంటుంది. పెద్ద పండగైన వినాయక చవితిని తీసుకుంటే దుస్తులు, నిత్యావసర సరుకులు, పూలు, పళ్ల వ్యాపారులకు ఎంతో లాభాలు చేకూరుస్తుంది. కార్మికులకు చేతి నిండా పని కల్పించి, రైతుల కడుపు నింపుతుంది. నవరాత్రులు నిర్వహించే ఈ ఉత్సవాల్లో కార్మికులకు అటూ ఇటూ పది రోజుల పాటు ఎన్నో పనుల ద్వారా ఉపాధి దొరుకుతుంది.

కళాకారులకూ..

చవితి, దశమి నవరాత్రులకు పందిళ్లు, వాటి ముందు ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కచేరీలు, ఆర్కెస్ట్రాలు, నాటికలు, బుర్రకథలు వంటి ఎన్నో కళారూపాలు పోటాపోటీగా ప్రదర్శిస్తూ ఎవరి భక్తి వారు చాటుకుంటారు.

అసంఘటిత కార్మికులకు ఉపాధి

వినాయకుడిని పెట్టిన ప్రతి చోటా పందిరి, దానికి సెట్టింగులు, విద్యుత్ దీపాలు అలంకరించేందుకు ఎలక్ట్రీషియన్స్, దినసరి కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లకు చేతినిండా పని దొరుకుంది.

ఎక్కువ రోజులు పని



పురోహితులకు ఏడాదిలో చాలా నెలలు పని ఉండదు. వినాయక చవితి పండగకు స్వామిని ప్రతిష్ఠించినప్పటి నుంచి నిమజ్జనం వరకు ధూప, దీప, నైవేద్యాలు పెట్టాలి, అలాగే కథ కూడా నిత్యం చెప్పాలి. ఇలా ఉపాధి దొరుకుతుంది.

– సుబ్రహ్మణ్య శాస్త్రి, పురోహితుడు, సాంబమూర్తినగర్, కాకినాడ

వెయ్యికళ్లతో ఎదురు చూస్తున్నాం



వినాయక విగ్రహాలు విక్రయించే వ్యాపారులందరూ వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో విగ్రహాలను పెడుతున్నారు. అందువల్ల మాలాంటి వారికి కొంత మేర ఆదాయం వస్తుంది.

– బొంతు శ్రీను, వినాయక విగ్రహాల వ్యాపారి, తాళ్లరేవు

మండపాలకు అభినందన పత్రాలు



నగర గణేశ ఉత్సవ సమితి సమావేశంలో పాల్గొన్న సభ్యులు

బోట్‌క్లబ్: ఈ ఏడాది కాకినాడ నగరం, గ్రామీణ ప్రాంతాల్లో 900 వరకూ వినాయకుని మంటపాలు ఉన్నాయని వారందరికీ నగర గణేశ ఉత్సవ సమితి అభినందన పత్రాలు ఇవ్వనున్నట్లు సమితి కో ఆర్డినేటర్ దూసర్లపూడి రమణరాజు అన్నారు. స్థానిక ప్రేజర్‌పేటలో శనివారం నగర గణేశ ఉత్సవ సమితి సమావేశం నిర్వహించారు. సమితి కన్వీనర్ వై.మాలకొండయ్య మాట్లాడుతూ ప్రతి మంటపం వద్ద శానిటేషన్, ముగ్గు వేయాలని ఇప్పటికే మున్సిపల్ కమిషనర్ కోరినట్లు చెప్పారు. నగరంలోని 13 నిమజ్జన ప్రాంతాలను అధికారులతో కలసి పరిశీలిస్తామని తెలిపారు. సమితి రూరల్ కోఆర్డినేటర్ రంభాల వేంకటేశ్వరరావు మాట్లాడుతూ గణేశ పూజలను సంప్రదాయంగా నిర్వహించి నిమజ్జనం చేయాలని ఆయన కోరారు. సమితి సభ్యులు సాల గ్రామ లక్ష్మీప్రసన్న, పెండెం శ్రీదేవి, పానుగుపాటి సుబ్బారావు, జి.భానోజీరావు, కోలా ఎల్లారావు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దారుఢ్యం



విద్యార్థులు, పీడీలకు క్రీడా సామగ్రి కిట్లను అందజేస్తున్న నాయకులు, అధికారులు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు శనివారం వాటిని అందజేసిన అనంతరం మాట్లాడుతూ సీఎం జగన్ వచ్చాక రూ.కోట్లతో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాలకు రూ.10 వేలు, ఉన్నత పాఠశాలలు, కళాశాలలకు రూ.17 వేల చొప్పున క్రీడా సామగ్రిని పీడీలు, విద్యార్థులకు జెడ్పీటీసీ అందజేశారు. తర్వాత స్కూల్ గేమ్స్ మండల స్థాయి క్రీడల విజేతలను అభినందించారు. పీడీలు కె.శ్రీనివాస్, వి.చాందిని శిరీష, ఉత్తమ ఉపాధ్యాయుడు జి.రాధాకృష్ణ సేవలకు గుర్తింపుగా వారిని సత్కరించి, అభినందించారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఎంఈఓ–2 పి.సత్యనారాయణ, హెచ్ఎం యు.లీలామనోహర్, వైఎస్సార్ సీపీ నాయకులు సాదే లోహిదాస్, రాయుడు శ్రీనివాస్, పీడీలు కె.నాగు, వై.సువర్చలా దేవి పాల్గొన్నారు.

సమగ్ర ఓటర్ల జాబితా రూపకల్పనకు చర్యలు

ఆర్డీవో సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సత్యనారాయణ

కాకినాడ రూరల్: సమగ్ర ఓటర్ల జాబితా రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నట్టు నియోజకవర్గం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీవో ఎస్‌వీవీ సత్యనారాయణ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో పర్యవేక్షణ అధికారులు, బూత్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షిప్త ఓటర్ జాబితా–2024 కు సంబంధించి మార్పులు చేర్పులు, తొలగింపులు, గ్రామాంతరం వెళ్లిన ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఓటరు జాబితాపై తరచు రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో రూరల్ తహసీల్దార్ వి. మురార్జీ, కరప తహసీల్దార్ పొన్నమండ శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్లు సారథి, సురేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మండలస్థాయి స్కూల్ గేమ్స్



కరప హైస్కూలులో బాలికల జట్ల మధ్య జరుగుతున్న కబడ్డీ పోటీ

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నతపాఠశాలలో జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి ఆటల పోటీలు శనివారంతో ముగిశాయి. అండర్–14, 17 విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, త్రోబాల్, బ్యాడ్మింటన్, యోగా, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ వంటి 9 అంశాల్లో పోటీలు నిర్వహించారు. మండలంలోని పలు హైస్కూళ్ల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. పీడీ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పీడీలు వి.చాందినీశిరీష, కె.నాగు, బీవీ ప్రసాద్, వై.సువర్చలాదేవి, డి.లక్ష్మీదేవి, ఎ.సుహాసిని, రాజారమేష్, సి.జాన్, కె.రేణుక ఆటల పోటీలను పర్యవేక్షించారు. విజేతలను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

జీజీహెచ్‌లో ఆక్సిజన్ లీక్

- భారీ శబ్దం రావడంతో పరుగులు తీసిన రోగులు



మరమ్మతు చేసిన ఆక్సిజన్ పైప్

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో శనివారం సాయంత్రం అలజడి రేగింది. సర్జికల్ భవంతిలోని వార్డులకు వెళ్లే మార్గంలో ఆక్సిజన్ లీకేజీ సంభవించింది. ఆక్సిజన్ పైప్ అనుసంధానం వదిలేసి భారీ శబ్దంతో విడిపోయింది. గోడలకు ఆనుకుని బాహ్యంగా ఉండే ఈ గొట్టాలు తీవ్ర ఒత్తిడితో వాయువు లీకవడంతో భారీ శబ్దం వచ్చింది. దీంతో వార్డుల్లో ఉన్న రోగులు భయపడి పరుగులు పెట్టారు. ఆసుపత్రి సిబ్బంది జరిగిన విషయం చెప్పి వారికి ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆక్సిజన్ లీకేజీని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి సహా అధికారులు పరిశీలించారు. తక్షణ మరమ్మతులు చేయించి ఆక్సిజన్ సరఫరాను పునరుద్ధరించారు. జీజీహెచ్‌లో ఆక్సిజన్ నిర్వహణలో నిర్లక్ష్యంపై సీనియర్ వైద్యులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం చర్చనీయాంశమైంది.

మృతదేహం ఆచూకీ లభ్యం

కాకినాడ రూరల్: సూర్యారావుపేట బీచ్‌లో స్వాధీనం చేసుకున్న మృతదేహం ఆచూకీ ఆదివారం తెలిసింది. మృతుడు వాకలపూడి గ్రామం శ్రీనివాస నగర్‌కు చెందిన బల్లిపాటి వెంకటరమణ (53)గా గుర్తించినట్టు ఎస్సై షరీఫ్ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. లాండ్రి నిర్వహించే ఆయన కొన్ని రోజులుగా అల్సర్ సంబంధ సమస్యతో బాధపడుతున్నారు. ఈ సమస్య వల్లే శనివారం సముద్రం వద్దకు వెళ్లి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడా లేదా ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడా అనేది దర్యాప్తులో తేలాల్సి ఉందని ఎస్సై తెలియజేశారు. అతడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మీయ స్వాగతం





నిడదవోలు పట్టణంలోని సెయింట్ అంబ్రోస్ పాఠశాల ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి వైఎస్సార్ కాపు నేస్తం నిధుల విడుదలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం బటన్ నొక్కి ప్రారంభించారు. తాడేపల్లి నుంచి పట్టణ సమీపంలోని సుబ్బరాజుపేట వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు హెలికాప్టర్‌లో వచ్చిన ఆయనకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎంపీ వంగా గీత స్వాగతం పలికారు.

అంతర్జాతీయ యోగా పోటీల్లో కాకినాడ విద్యార్థుల ప్రతిభ

- రెండు రజత పతకాలు కైవశం
- అభినందించిన ఎమ్మెల్యే, జేసీ



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): థాయిలాండ్‌లో ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి పదో తేదీ వరకు జరిగిన ఏషియా పసిఫిక్ యోగా స్పోర్ట్స్ చాంపియన్ షిప్‌లో కాకినాడకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలకు ఆరు దేశాల నుంచి 250 మంది హాజరయ్యారు. సీనియర్ బాలికల విభాగంలో 26–30 సంవత్సరాల కేటగిరిలో బొజ్జా లక్ష్మీ వెంకట సాయి రజత పతకం సాధించింది. 32–40 సంవత్సరాల పురుషుల విభాగంలో సయ్యద్ యాసిన్ మోహిద్దీన్ రజత పతకం కైవశం చేసుకున్నారు. గతంలో వీరు జిల్లా, రాష్ట్రస్థాయిలో 3 స్వర్ణ, జాతీయ స్థాయిలో రెండు కాంస్య పతకాలు సాధించారు. విజేతలను శనివారం కాకినాడలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేతో పాటు జేసీ ఇలక్కియ, రామారావు వీరిని అభినందించారు. ఢిల్లీలో డిసెంబరు 16, 17 తేదీల్లో జరిగే ప్రపంచ యోగా పోటీలకు వీరు అర్హత సాధించారు. థాయిలాండ్ పోటీలకు హాజరయ్యేందుకు రెడ్‌క్రాస్ సంస్థ తరఫున ఆర్థిక సాయం అందించినట్లు రామారావు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై విస్తృత ప్రచారం చేయాలి



వేళంగి పీహెచ్‌సీలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఐఓ డాక్టర్ రత్నకుమార్, పీహెచ్‌సీ సిబ్బంది

కరప: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెలాఖరు నుంచి కొత్తగా అమలు చేయనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారంచేసి, ప్రజలకు అవగాహన కల్పించాలని డిస్ట్రిక్ట్ ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ రత్నకుమార్ సూచించారు. మండల పర్యటనలో భాగంగా శనివారం ఆయన వేళంగి పీహెచ్‌సీని సందర్శించి మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకుని, తర్వాత నిర్వహించే ఆరోగ్య శిబిరాల్లో వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేయాలన్నారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి ఎంకే సౌజన్య, సిబ్బందితో కలసి డీఐఓ డాక్టర్ రత్నకుమార్ జగనన్న ఆరోగ్య సురక్ష కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం పీహెచ్‌సీ ద్వారా అందజేస్తున్న ఆర్‌సీహెచ్, యూఐపీ తదితర ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్‌లను ఆయన పరిశీలించి, పలు సూచనలిచ్చారు.

ఉపాధికి దారి చూపిన 'గడప గడపకూ..'

- ద్వారంపూడి నివాసం వద్ద జాబ్‌మేళా
- 33 మందికి ఉద్యోగాల కల్పన



నిరుద్యోగ యువతతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: గడప గడపకూ మన ప్రభుత్వంలో ఉద్యోగాల కోసం నిరుద్యోగ యువత చేసిన అభ్యర్థనకు మూడు రోజుల్లోనే పరిష్కారం దొరికింది. సుమారు 33 మంది నిరుద్యోగ యువతకు వేర్వేరు కంపెనీల్లో ఉపాధికి అవకాశం దక్కింది. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి నాలుగు రోజుల క్రితం ఏటిమొగ ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఆ క్రమంలో బీకాం, బీటెక్ సహా డిగ్రీలు చేసిన అనేక నిరుద్యోగ యువత, వారి తల్లిదండ్రులు ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నామంటూ ద్వారంపూడి దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు ఎమ్మెల్యే ద్వారంపూడి వికాస ఆధ్వర్యంలో శనివారం తన నివాసం వద్ద జాబ్ మేళా ఏర్పాటు చేశారు. 34 మంది నిరుద్యోగ యువత ఈ జాబ్ మేళాకు హాజరుకాగా ఆయా అర్హతలను బట్టి 33 మందికి ప్లేస్‌మెంట్స్ కోసం సిఫార్సు చేశారు. బజాజ్ క్యాపిటల్, ఎస్‌కే, ఎస్‌బీఐ కార్డు, హనీ గ్రూప్, టెక్ మహీంద్రా, తదితర కంపెనీల్లో వీరికి ఉద్యోగ అవకాశాలు దక్కాయి. వయస్సు కారణంగా ఒకే ఒక్క అభ్యర్థికి అవకాశం లేక పోవడంతో అతనికి ప్రత్యామ్నాయం చూస్తామని ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎంపికైన అభ్యర్థుల్లో ఎవరికైనా ఉద్యోగాల చేరికలో ఆయా కంపెనీల నుంచి ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని, వీరికి కూడా ఉద్యోగం కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.12 వేల నుంచి రూ.17 వేల వరకూ వేతనాలు ఉంటాయని ఆయా కంపెనీల ప్రతినిధులు తెలిపారు.

ఇస్లాంలో అవినీతికి చోటులేదు

- 'బాబు' కోసం దువా సరికాదు
- వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ బషీరుద్దీన్



కాకినాడ: ఇస్లాం సంప్రదాయంలో రిష్వత్‌ఖోర్ (లంచావతారులు), నాజాయిజ్ (అక్రమ సంపాదనాపరులు)లకు చోటు లేదని ముస్లిం మైనార్టీ సెల్ ప్రాంతీయ సమన్వయకర్త, వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ బషీరుద్దీన్ పేర్కొన్నారు. ఆర్థిక నేరస్తుడైన చంద్రబాబు బయటకు రావాలని కోరుతూ కొంతమంది ముస్లింలు దువా చేయడం విడ్డూరంగా ఉందన్నారు. శనివారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ స్థానిక బాలాజీచెరువు వద్ద కొందరు ముస్లింలు నిరాహారదీక్ష చేయడాన్ని తప్పుపట్టారు. చేసిన తప్పులకు చంద్రబాబు చట్టప్రకారం జైలుకు వెళ్లారని ఆయన పేర్కొన్నారు. అటువంటి ఆర్థిక నేరస్తుడు బయటకు రావాలని ముస్లిం సమాజంలోని కొందరు కోరుకోవడం, ఆయన కోసం మసీదుల్లో ప్రార్థనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ముస్లిం సంప్రదాయం ప్రకారం ఇటువంటి వారిని ప్రోత్సహించకూడదన్నారు. విచారణ ఎదుర్కొంటున్న ఆయనకు మద్దతుగా దువా చేయడం సరికాదని, ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. టీడీపీ నేతల నుంచి సొమ్ములు తీసుకుని కొందరు ఇటువంటి తప్పులు చేస్తున్నారని మండిపడ్డారు. ఎవరెన్ని డ్రామాలు కట్టినా ముస్లిం సమాజం ముఖ్యమంత్రి జగన్‌కు మద్దతుగా ఉంటారని స్పష్టం చేశారు. రాష్ట్రం కోసం, దేశం కోసం మంచి మనసుతో చేసే దువా మాత్రమే అల్లాహ్ సన్నిధిలో స్వీకరించబడతాయని స్పష్టం చేశారు.

ఏఈలకు డీఈలుగా పదోన్నతి

కాకినాడ: నగరపాలక సంస్థలో పనిచేస్తున్న నలుగురు ఏఈలకు డీఈలుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు పుర పరిపాలనశాఖ పదోన్నతులకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసింది. ఏఈలు కె.లోవరాజు, జేఎస్ఎస్ లక్ష్మి నగరంలోనే డీఈలుగా నియమితులయ్యారు. మరో ఏఈ విరూపాక్ష రాజమండ్రి నగరపాలక సంస్థకు, వై.సుషీ కుమారి రాజమహేంద్రవరం రుడాకు పదోన్నతిపై వెళ్లారు. సుదీర్ఘకాలం పాటు ఇక్కడ పనిచేసి డీఈలుగా పదోన్నతి పొందిన ఏఈలను కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, ఎస్ఈ పి.సత్యకుమారి అభినందించారు.

వైద్య విద్యార్థులు మరింత బాధ్యతగా ఉండాలి

- డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వర్సిటీ వీసీ బాబ్జీ
- ఘనంగా రంగరాయ వైద్య కళాశాల వార్షికోత్సవం



డాక్టర్ బాబ్జీని సత్కరిస్తున్న రంగరాయ యాజమాన్యం

కాకినాడ క్రైం: రంగరాయ వైద్య కళాశాల 65వ వార్షికోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కోరుకొండ బాబ్జీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ చివరి సంవత్సరం చదువుతున్న వైద్య విద్యార్థులు మరింత బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కళాశాల కీర్తి ప్రతిష్ఠలతో పాటు సమాజంలో వ్యక్తిగత గుర్తింపు తమ చేతుల్లో ఉంటాయని అన్నారు. అనంతరం కార్యక్రమ అధ్యక్షుడు, రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు డాక్టర్ బాబ్జీతో కలిసి పతకాలు అందించి అభినందించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విష్ణువర్ధన్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవిని సత్కరించారు. రంగరాయ వైద్య కళాశాల, విద్యార్థుల తరఫున వీసీ డాక్టర్ బాబ్జీ ప్రత్యేక సత్కారాన్ని అందుకున్నారు. సుమారు 500 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమానికి ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులుగా డాక్టర్ కె.శైలజ, డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు వ్యవహరించారు.